అందుకే.. ఆయన మళ్లీ సీఎం కావాలి

- హామీలన్నీ అమలుచేసిన జగనన్న
- రెండోసారి అధికారంలోకి వస్తే జీవన ప్రమాణాలు మరింత మెరుగు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- సంక్షేమ లబ్ధి ప్రచార బోర్డు ఆవిష్కరణ


సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ పద్మశ్రీ, కమిషనర్ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: నవరత్న పథకాల ద్వారా ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తేనే పేదలు సుఖసంతోషాలతో ఉండగలరని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం-18ఎ సచివాలయ పరిధిలోని తూరంగిపేటలో గురువారం 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే' నిర్వహించారు.

అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన ప్రచార బోర్డును ఎమ్మెల్యేతో పాటు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కరోనా కాలంలో కూడా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదల జీవితాలకు భరోసా ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు.

అమ్మఒడి, చేయూత, వాహనమిత్ర, రుణ మాఫీ వంటి దాదాపు 33 సంక్షేమ కార్యక్రమాల ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు జగన్ అవిశ్రాంతంగా శ్రమించారన్నారు. నిత్యం పేదల అభివృద్ధి, సంక్షేమానికి పరితపించే ఇటువంటి సీఎం మరోసారి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలు ఆనందం, సుఖ సంతోషాలతో జీవించగలరన్నారు. గతంలో తన పార్టీ మ్యానిఫెస్టో సైతం వెబ్‌సైట్ నుంచి తొలగించిన చంద్రబాబు ఇప్పుడు మరోసారి దొంగ హామీలతో పవన్‌కల్యాణ్‌ను వెంటేసుకుని ప్రజల్లోకి వస్తున్నారన్నారు. వారిద్దరి మాయమాటలు నమ్మొద్దని ఆయన సూచించారు. కిలో రెండు రూపాయల బియ్యానికి ఎన్టీఆర్, ఆరోగ్యశ్రీకి వైఎస్సార్, అమ్మఒడి వంటి మరెన్నో సంక్షేమ ఫలాలకు సీఎం జగన్ బ్రాండ్ అంబాసిడర్లుగా నిలిస్తే చంద్రబాబుకు చెప్పుకునేందుకు ఒక్క పథకం కూడా లేదని ఎద్దేవా చేశారు. ఒక్క 18వ డివిజన్ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.9.45 కోట్ల లబ్ధి ప్రజలకు చేకూరిందన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టిన తరువాత 2019లో ప్రతి వెయ్యి ఇళ్లకు సచివాలయం, 50 ఇళ్లకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించేందుకు ప్రతి సచివాలయ పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రచార బోర్డులను ఆవిష్కరించడంతో పాటు ఇంటింటికీ వెళ్లి అర్హత ఉండి, పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి పరిష్కరిస్తామన్నారు.

కొడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, స్థానిక నాయకులు ధోని చిట్టిబాబు, విశ్ల సత్యనారాయణ, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరయ్యారు.

క్లుప్తంగా

ఫ్లైఓవర్ పనుల పరిశీలన


జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: కొండయ్యపాలెం ఫ్లైఓవర్‌కు అనుసంధానంగా శారదాదేవి ఆలయం సమీపంలో రూ.1.95 కోట్లతో నిర్మిస్తున్న జంక్షన్ అభివృద్ధి పనులను కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు గురువారం పరిశీలించారు. పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ ఈ ఫ్లైఓవర్‌ను ప్రజలకు అంకితం చేసేందుకు వచ్చే అవకాశం ఉన్నందున నవంబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ బీహెచ్ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మరకత మణికంఠ

బోట్‌క్లబ్: ఉత్తరా నక్షత్రం సందర్భంగా కాకినాడలోని పలు అయ్యప్ప స్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకాలు చేశారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రామారావుపేటలోని మరకత మణికంఠకు ప్రత్యేక పూజలు చేశారు. పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

క్షేత్రస్థాయిలో వైద్య సేవలు బలోపేతం కావాలి

కాకినాడ క్రైం: ప్రజలకు అందుతున్న వైద్య సేవలు క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ మేరకు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పేద నిరుపేద వర్గాలకు అత్యున్నత వైద్య సేవలు అందించే లక్ష్యంతో వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు చేస్తోందని అన్నారు. ఈ ప్రయోజనాలన్నీ ప్రజలకు పూర్తి స్థాయిలో అందేలా కృషి చేయాలని సూచించారు.

రైతులకు అందుబాటులో ఉండండి

పెద్దాపురం: గ్రామాల్లో వ్యవసాయ శాఖ వీఏఏ, వీహెచ్ఏలు రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని స్థానిక రైతు శిక్షణ కేంద్రం పీడీ పి.హరిబాబు అన్నారు. పాండవుల మెట్ట వద్ద ఉన్న రైతు శిక్షణ కేంద్రంలో గురువారం డీఆర్‌సీ ఏడీఏ మాధవీలత అధ్యక్షతన మండలంలోని ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో రైతులకు వరి కోతలు, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆర్బీకే వద్ద ఏర్పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు, వారికి అవసరమైన సలహాలు, సూచనలివ్వాల్సిన బాధ్యత వ్యవసాయ సహాయకులపై ఉందన్నారు. ఖరీఫ్‌లో ఆర్బీకేల వద్ద అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తనాలు వంటి వాటిపై అవగాహన కల్పించి రైతులకు అందుబాటులో సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ దైవకుమార్, ఏఓలు సంజయ్‌కుమార్, అమృత, గాయత్రి, పద్మజ, విజయలక్ష్మిలతో పాటు ఆయా గ్రామాల వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన


అరట్లకట్టలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

కరప: పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంను చేయాల్సిన ఆవశ్యకత ఉందని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలం అరట్లకట్టలో గురువారం స్థానికనాయకులతో కలిసి జెడ్పీటీసీ, ఎంపీపీలు 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' నిర్వహించారు. సీఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన తీసుకు వచ్చి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో వివిధ నిధుల ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. అరట్లకట్ట గ్రామసచివాలయ పరిధిలోని అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాల్లో సంక్షేమ పథకాలద్వారా రూ.56,04,70,550 మేర లబ్ధి చేకూరిందన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కన్నబాబును, సీఎంగా జగన్‌ను గెలిపించాలన్నారు. అనంతరం వలంటీర్లను వెంటపెట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ జగన్‌పాలనలో అమలుచేస్తున్న సంక్షేమపథకాలను వివరిస్తూ 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' బుక్‌లెట్‌ను అందజేశారు. అరట్లకట్ట, గొడ్డటిపాలెం సర్పంచ్‌లు గోపి సత్యవేణి, వాసంశెట్టి శ్రీనుబాబు, ఎంపీటీసీ సీహెచ్ కామేశ్వరి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, ఉప సర్పంచ్ వి.విశాలాక్షి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సోడగం సూరిబాబు, మద్దూరి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికే మళ్లీ పట్టం కడదాం

- నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ


గ్రామసభలో మాట్లాడుతున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను తూచ తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్‌లో మళ్ళీ ఆయనే సీఎంగా రావాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఇంద్రపాలెం సచివాలయం-2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత సచివాలయం వద్ద ఎంపీడీవో స్వప్న, తహసీల్దార్ మురార్జీ, మండల నోడల్ అధికారి, ఈవో పీఆర్డీ సీతారామాంజనేయులు తదితరులు సమక్షంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి వివరాలను ప్రదర్శించారు. అనంతరం జగనన్న సుపరిపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి అంశాలపై గ్రామ సభ ద్వారా ప్రజలకు వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మళ్లీ జగన్ పాలన కొనసాగేలా రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు మరోసారి విజయం అందించాలని కోరారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి నవరత్న పథకాలను తీసుకొచ్చి విజయవంతంగా అమలు చేశారన్నారు. ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ తదితరులు పథకాల గురించి వివరించారు. అనంతరం పార్టీ నాయకులు సచివాలయం పరిధిలో పర్యటించి వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏపీకి జగనే ఎందుకు రావాలో వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గీసాల వీరబాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బాల్య వివాహ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో గురువారం డివిజన్‌లో ఉన్న మండల స్థాయి బాల్యవివాహ నిర్మూలన అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. బాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతోనే బాల్య వివాహాలు అడ్డుకట్టవేయగలమన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వుల అందజేత


నియామక ఉత్తర్వులు అందిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీలో భాగంగా ఎన్నికైన వారికి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికాశుక్లా నియామక ఉత్తర్వులు అందించారు. అర్హత ప్రాతిపదికన ఎంపికైన 10 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ చేసి జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టుల్లో నియమిస్తూ ఉత్తర్వులు అందజేశామన్నారు. జేసీ ఇలక్కియ, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ, డీఈఓ నాగమణి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు పరిశీలన


ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ రూరల్: స్థానిక అచ్చంపేట సెంటర్ నుంచి రాజానగరం వరకు నిర్మించ తలపెట్టిన ఏడీబీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తిమ్మాపురంలో ఆక్రమణల తొలగింపును ఆర్డీవో ఈ.కిశోర్ గురువారం పరిశీలించారు. భూసేకరణ పూర్తిచేసిన లబ్ధిదారులకు నష్టపరిహారం అందజేసినట్టు తెలిపారు. అదే విధంగా నిర్దిష్ట గడువులో ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వీరవల్లి మురార్జీ తదితరులు ఉన్నారు.

గ్రావెల్ తవ్వకాల అడ్డగింత

పెద్దాపురం: మండలంలోని వాలుతిమ్మాపురంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ లారీలను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బచ్చల రాజు ఆధ్వర్యంలో గ్రామ యువత లారీలను అడ్డుకుని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల నుంచి గ్రామాల మీదుగా వందల సంఖ్యల్లో లారీల ద్వారా అక్రమ గ్రావెల్ తరలిస్తున్నారన్నారు. గ్రావెల్ తరలింపు వెనుకు ఉన్న ముఠాపై చర్యలు తీసుకోవాలని రాజు కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

11న డయల్ యువర్ డిపో మేనేజర్

కాకినాడ: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ చెప్పారు. ప్రయాణికులు 99592 25534 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునని ఆయన సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాలేయ చికిత్స చేయించుకున్న కె.రమేష్‌కు మార్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.70,000 మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం తన కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ఎంతోమంది పేదలకు సీఎం సహాయనిధి బాసటగా నిలుస్తోందన్నారు.

దళారులకు ధాన్యం అమ్మవద్దు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రైతులు దళారులకు ధాన్యం అమ్మవద్దని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ డి పుష్పమణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలు ద్వారా విక్రయిస్తే రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2183, ఏ గ్రేడు రకానికి రూ.2203గా నిర్ణయించినట్టు తెలిపారు. సామర్లకోట మండలంలో ఈ నెల 3న రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి ఐదు రోజులు వ్యవధిలో వారి ఖాతాలో నగదు జమచేసినట్లు చెప్పారు.

సంక్షిప్తంగా..

విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థిని ప్రోత్సహిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహ నాయక్

కాకినాడ క్రైం: స్థానిక పీఆర్ కళాశాలలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు రక్తదానం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్, పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 190 మంది విద్యార్థులు రక్తదానం చేశారని వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణాధికారి రోణంకి రమేష్, జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ శారద, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు


గర్భిణికి సూచనలిస్తున్న డాక్టర్ శ్రీనివాసనాయక్

కరప: గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ, వైద్యుల సలహాల మేరకు పోషకాహారం తీసుకోవాలని, డివిజనల్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి సూచనలిచ్చారు. పీహెచ్‌సీ పరిధిలోని 11 ఆరోగ్య ఉపకేంద్రాల ఏఎన్ఎంలు 42 మంది గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యులు వారిని పరీక్షించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కరప: మండలంలోని కరప, వేళంగి గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయా లైబ్రేరియన్లు ఎస్‌వీఎస్ ఫణీంద్ర కుమార్, పాట్నీడి వెంకటరంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న వారోత్సవాలు ప్రారంభించి, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తుల గురించి స్మరించుకోవడం, 17న రచయితల సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు వ్యక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలు, చదువంటే మాకిష్టం పై పాఠకులకు, ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రదానం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

ఉచిత న్యాయంపై కరపత్రాల ఆవిష్కరణ

కాకినాడ రూరల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత న్యాయంపై ప్రచురించిన కరపత్రాలను బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయరాజు మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. కింద స్థాయి కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు పేదలకు ఉచితంగా న్యాయ సహాయం లభిస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు అన్నమ్మ ఘాటీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ జి ప్రసాద్ తెలిపారు. నరసింహారోడ్, శివాలయం వీధి, తారకరామా నగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్, సుందర్ నగర్, పప్పుల మిల్లు ప్రాంతం, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ముగ్గుపేట, రెల్లి పేట, నారాయణమ్మ తోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు అసౌకర్యానికి సహకరించాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పశువుల సంచారంతో అవస్థలు

బోట్‌క్లబ్: నగరంలో రహదారులపై విచ్చలవిడిగి తిరిగే పశువుల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. వాటి వల్ల వాకర్లు ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. గురువారం ఉదయం స్థానిక రామారావుపేట మూడు లైట్ల సెంటర్‌లో ఓ వాకర్‌పై పశువులు దాడి చేయడంతో ఆయన ఆస్పత్రి పాలయ్యారన్నారు. రోడ్లపై పశువులను వదిలేవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సార్వా సిరులకు సమాయత్తం

- కోతలకు సిద్ధమవుతున్న రైతులు
- నియోజకవర్గంలో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలు


సిరిగలపల్లిలంక సమీపంలో యంత్రంతో పంట కోత

కరప: మండలంలోని సార్వా ఆశాజనకంగా ఉంది. తొలకరి పంట పక్వదశకు చేరుకోవడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై, వేసవిని మించిన ఎండలు కాయడంతో సాగునీటి ఎద్దడి ఎదురైంది. అయినప్పటికీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అప్రమత్తం చేయడంతో నీటిపారుదల అధికారులు సాగునీటిని అందించారు. తొలకరిపంట బాగుందని, మరో రెండు, మూడు వారాల్లో పంట చేతికి అందుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. మెరక ప్రాంతాల్లోను, కాలువ శివారు భూముల్లో సాగు ఆలస్యమైంది. మండలంలో సుమారు 14,090 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎంటీయూ-7029 (స్వర్ణ) రకం ఎక్కువగా సాగు చేయగా రబీ విత్తనాల కోసం ఎంటీయూ-3626 (బొండాలు), ఇతర రకాలు సాగుచేశారు. ఎకరానికి ఇంతవరకూ రూ.30 వేల వరకు పెట్టుబడులు అయినట్టు రైతులు అంటున్నారు. ముందుగా ఊడ్చిన వరిచేలు పక్వదశలోను, లేత చేలు పాలుపోసుకుని, గింజగట్టిపడే దశలోను ఉన్నాయి. ఎకరానికి 30 నుంచి 40 బస్తాలు దిగుబడి రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.

మండలంలో కోతలు ప్రారంభం

మండల పరిధిలో ముందుగా ఊడ్చిన పొలాల్లో వరిచేలు పక్వదశకు చేరుకోగా, విత్తనాల కోసం వేసిన పొలాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. యంత్రంతో కోయించడానికి ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.3,500 తీసుకుంటున్నారు. యంత్రాలతో కాకుంటే మగవారికి రూ.900, మహిళలకైతే రూ.400 తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. సిరిగలపల్లంక, వేళంగి గ్రామాల్లో కోతలు ప్రారంభించారు. దీపావళి అమావాస్య వెళ్లాక సార్వా కోతలు జోరందుకుంటాయని రైతులు నక్కా వీరభద్రరావు, రెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

20 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



పంటకు మద్దతు ధర అందించేందుకు నియోజకవర్గ పరిధిలో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, మండలంలో 20 ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది కనీస మద్దతు ధరగా గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,203, 75 కిలోల బస్తాకు రూ.1,652, సాధారణ రకం (కామన్) క్వింటాల్‌కు రూ.2,183, 75 కిలోల బస్తా రూ.1,637 వంతున మద్దతు ధర అందిస్తారు. గతేడాది ఖరీఫ్ సీజన్ కంటే ఈ ఏడాది క్వింటాలుకు రూ.143 అధికంగా ప్రభుత్వం నిర్ధారించింది.

– ఏపీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప మండలం

కంటి సంరక్షణపై శ్రద్ధ అవసరం

బాలాజీచెరువు: 60 ఏళ్ల పైబడ్డాక కంటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని క్లాత్ అండ్ ఐ గ్లాస్ ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. రామారావుపేట లయన్స్ కార్యాలయంలో 125 మందికి రూ.60 వేల విలువైన కళ్ల జోళ్లను గురువారం పేదలకు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, సభ్యులు పాల్గొన్నారు.